

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

సామాజిక పునర్నిర్మాణవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాంఘిక అసమానతలను సమతుల్యం చేయడానికి అప్పట్లోనే విశేష కృషి చేశారని నేతలు కొనియాడారు. సామాజిక, సాంఘిక సంస్కరణలకు మూల పురుషుడైన ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.



అనకాపల్లిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, జేసీ జాహ్నవి, మళ్ల సురేంద్ర, బీసీ నేతలు

విస్తరణం

అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణపై వివాదం

- టీడీఆర్ బాండ్లు వద్దు, నష్టపరిహారమే కావాలని నిర్వాసితుల డిమాండ్
- గ్రామ సభల్లో అధికారులకు విస్పష్టం
- 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని వినతి
- పార్టీలకు అతీతంగా అఖిలపక్షం ఏర్పాటు
- ఇటీవల మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం
- ప్రజాభిప్రాయం మేరకే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ
- ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొస్తున్న నిర్వాసితులు



రెండు లేన్లుగా విస్తరించనున్న అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులకు నిర్వాసితుల నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. నష్టపరిహారాన్ని వీఎంఆర్‌డీఏ ద్వారా టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల రూపంలో ఇస్తామని అధికారులు చెబుతుండగా.. నిర్వాసితులు ససేమిరా అంటున్నారు. టీడీఆర్‌లు వద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు గ్రామాల వారీగా నిర్వాసితులతో సమావేశాలు ఏర్పాటు చేసి, టీడీఆర్ బాండ్లు తీసుకుని, రహదారి విస్తరణకు సహకరించాలని కోరుతున్నారు. కానీ నిర్వాసితులు ఇందుకు ఒప్పుకోవడంలేదు.



మునగపాక మండలం తిమ్మరాజుపేటలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి నుంచి మనగపాక మీదుగా అచ్యుతాపురం వరకు 13.75 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు వుంది. ప్రస్తుతం దీని వెడల్పు 30-35 అడుగులు వుంది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుతో ఎన్ని పరిశ్రమలు, కంపెనీలు వచ్చాయి. మరెన్నో నిర్మాణంలో వున్నాయి. రాంబిల్లి మండలంలో ప్రత్యామ్నాయ నేవల్ ఆపరేషనల్ బేస్ ఏర్పాటవుతున్నది. ఇంకా అచ్యుతాపురం మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో 'బార్క్' నిర్మాణంలో వుంది. దీంతో అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డులో వాహనాల రద్దీ ఎన్నో రెట్లు పెరిగింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇది సింగిల్ లేన్ రోడ్డు కావడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తున్నది. భారీ వాహనాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం చేరుకోవడానికి రద్దీ సమయాల్లో సుమారు గంట సేపు పడుతున్నది. ఈ నేపథ్యంలో రహదారిని విస్తరించాలని పదేళ్ల నుంచి ప్రజలు కోరుతున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వ హయాంలో కదలిక వచ్చింది.

వంద అడుగులకు విస్తరణ

ప్రస్తుతం సింగిల్ లేన్‌గా వున్న ఈ రహదారిని రూ.243 కోట్లతో డబుల్ లేన్‌గా అభివృద్ధి చేయడానికి (సుమారు వంద అడుగుల వెడల్పు) ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విస్తరణలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన, మధ్యలో రెండుచోట్ల మైనర్ వంతెనలు, 47 కల్వర్టులు నిర్మించనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల లెక్కల ప్రకారం రహదారి విస్తరణ కారణంగా అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో స్థలాలు, ఇళ్లు, భూములు కోల్పోయే వారు సుమారు 1,200 మంది వుంటారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. మంత్రి నారా లోకేశ్ అచ్యుతాపురం జంక్షన్‌లో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా చేశారు.

టీడీఆర్ బాండ్లను వద్దంటున్న నిర్వాసితులు

రోడ్డు విస్తరణ కారణంగా స్థలాలు, ఇళ్లు, దుకాణాలు, పొలాలు కోల్పోయే వారికి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తుంటుంది. అయితే ... మిగతా 8వ పేజీలో

కొత్త రేషన్ డిపోలను డీలర్లకు అప్పగించరా?

రెండు నెలల క్రితం నియామకపత్రాలు అందజేసి చేతులు దులుపుకున్న అధికారులు

- జిల్లాలో 60 రేషన్ దుకాణాలు ఖాళీ
- వీటితోపాటు కొత్తగా 30 రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి గత డిసెంబరులో నోటిఫికేషన్
- అదే నెలలో పరీక్ష, ఇంటర్వ్యూలు, ఎంపిక ప్రక్రియ పూర్తి
- నియామక పత్రాలు సైతం జారీ
- ఇంతవరకూ రేషన్ డిపోలను అప్పగించని వైనం



(ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కొత్తగా మంజూరైన రేషన్ డిపోలతోపాటు, వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన పాత డిపోలకు డీలర్ల నియామకానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డిసెంబరులో నోటిఫికేషన్ జారీ చేసి, రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి తుదిజాబితాను ప్రకటించారు. తరువాత ఆయా అభ్యర్థులకు నియామక పత్రాలను సైతం అందించారు. ఇది జరిగి మూడు నెలలు దాటినప్పటికీ డిపోల నిర్వహణను వీరికి అప్పగించలేదు. అధికారుల తీరుపై కొంతమంది అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన 30 రేషన్ డిపోలతోపాటు వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన 60 రేషన్ డిపోలకు డీలర్ల నియామకానికి అధికారులు గత ఏడాది డిసెంబరులో నోటిఫికేషన్ జారీ చేశారు. అదే నెల 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూలు నిర్వహించారు. తరువాత ఎంపికైన అభ్యర్థులతో తుది జాబితాను సైతం విడుదల చేశారు. వెంటనే ఒక్కో అభ్యర్థి నుంచి పౌర సరఫరాల శాఖకు రూ.20 వేలు, డీలర్ పేరున వెయ్యి రూపాయల చలానా కూడా కట్టించుకున్నారు. డిపో నిర్వహణకు సొంత షాపు ఉండాలి. ఒకవేళ అద్దె షాపు అయితే ఐదు సంవత్సరాలపాటు లీజు తీసుకున్నట్టు అగ్రిమెంట్లు కూడా తీసుకున్నారు. సంక్రాంతి తర్వాత డిపోలు అప్పగిస్తామని, ఫిబ్రవరి నుంచి రేషన్ సరఫరా అవుతుందని చెప్పారు. అయితే సంక్రాంతి తరువాత ... మిగతా 8వ పేజీలో

గోవాడ షుగర్స్‌లో ముగిసిన క్రషింగ్

పలుమార్లు అవాంతరాలతో 80 రోజులపాటు నడిచిన ఫ్యాక్టరీ

- 1.09 లక్షల టన్నుల చెరకు గానుగ
- 53 వేల క్వింటాళ్ల వరకు పంచదార ఉత్పత్తి
- రికవరీ ఐదారు శాతానికే పరిమితమా?



చోడవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ గురువారం రాత్రితో ముగిసింది. ముందుగా ప్రకటించినట్టు గురువారం మధ్యాహ్నంతో ముగించాల్సి వుండగా, కొద్దిసేపటి ముందు సాంకేతిక సమస్య తలెత్తడంతో క్రషింగ్ ఆగిపోయింది. అవాంతరాలను సరిదిద్ది ఫ్యాక్టరీని రన్నింగ్‌లో పెట్టి మిగిలిన చెరకును క్రషింగ్ చేసి సీజన్ ముగిసిందని ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 21వ తేదీన క్రషింగ్ ప్రారంభించి, ఏప్రిల్ పదో తేదీతో ముగించారు. మొత్తం మీద 81 రోజులపాటు క్రషింగ్ జరిగింది. కానీ క్రషింగ్ ప్రారంభించిన నాటి నుంచి, క్రషింగ్ ముగిసే వరకు పలుమార్లు సాంకేతిక సమస్యలు, బగాస్ కొరత వంటి కారణాలతో క్రషింగ్ ఆగిపోయింది. ఈ సమయాన్ని మినహాయిస్తే క్రషింగ్ సుమారు 60 రోజులపాటు జరిగి వుంటుందని అంచనా. ప్రస్తుత సీజన్‌లో కనీసం లక్షన్నర టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని ఫ్యాక్టరీ అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, చివరకు లక్షా తొమ్మిది వేల టన్నులతో ముగించాల్సి వచ్చింది. వాస్తవానికి పొలాల్లో ఇంకా చెరకు వుంది. కానీ ఫ్యాక్టరీలో క్రషింగ్ అస్తవ్యస్తంగా తయారవడం, ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద చెరకు బండ్లతో రైతులు రోజుల

అస్వస్థతతో కార్మికుడి మృతి

- గ్లాండ్ ఫార్మాలో ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

ఫార్మాసిటీలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం ఒక కార్మికుడు అస్వస్థతకు గురై మృతిచెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం తుమ్మపాల ఇందిరా కాలనీకి చెందిన బావిరిశెట్టి నాగేశ్వరరావు (54) ఫార్మాసిటీలోని గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ పరిశ్రమలో హౌస్ కీపింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రోడ్డు క్లీనింగ్ పనులు చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్ప కూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే రాంకీ క్లినిక్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాజువాక వెళ్లి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

త్వరలో ఇంటింటికీ కొళాయి

హోం మంత్రి వి.అనిత

- వేంపాడులో మార్నింగ్ వాక్



వృద్ధురాలి యోగాక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

పాయకరావుపేట నియోజకవర్గంలో త్వరలో ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని హోంమంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనిత చెప్పారు. మండలంలోని వేంపాడులో శుక్రవారం ఆమె మార్నింగ్ వాక్ చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడారు. బస్సులో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులతో కరచాలనం చేశారు. వేంపాడులో మంచినీటి సమస్యను ఈ నెలాఖరు నాటికి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఎన్టీఆర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట కూటమి పార్టీల నాయకులు వున్నారు.



అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

నూకాంబిక అమ్మవారికి పంచామృత అభిషేకాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

చైత్రమాసం చతుర్దశి సందర్భంగా శుక్రవారం స్థానిక నూకాంబిక అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ శాంతిప్రభ



డాక్టర్ ఎం.శాంతిప్రభ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ ఎం.శాంతిప్రభ శుక్రవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.రవికుమార్ వ్యక్తిగత కారణాల వల్ల మూడు వారాలు సెలవుపై వెళ్లారు. దీంతో విశాఖపట్నం డీఎంహెచ్‌వో శాంతిప్రభ పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

చెరువులో చెట్లు నరికివేత

అడ్డుకున్న పంచాయతీ సభ్యులు, రైతులు

- కోర్టు తీర్పుమేరకే నరికిస్తున్నట్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు వెల్లడి



చెరువులో నరికేసిన నేరేడు చెట్లు

సబ్బవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని గొటివాడ సూరప్పరాజ్ చెరువులో నేరేడు వృక్షాలు, నీలగిరి చెట్ల నరికివేతను పంచాయతీ పాలవర్గ సభ్యులు, రైతులు అడ్డుకున్నారు. అయితే కోర్టు తీర్పు మేరకు చెరువులో చెట్లు నరికిస్తున్నట్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొండా కల్యాణ్‌రాజ్, లగిశెట్టి కుమార్, విరోతి రామారావు, సాలాపు చిట్టిబాబు తదితరులు మాట్లాడుతూ.. గొట్టివాడ సూరప్పరాజ్ చెరువులో సుమారు 15 ఏళ్ల క్రితం అటవీ శాఖ అధికారుల సహకారంతో నీలగిరి మొక్కలు నాటామని, అప్పటికే నేరేడు వృక్షాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది కూలీలు నేరేడు వృక్షాలు, నీలగిరిచెట్లను నరుకుతున్నట్టు తెలియడంతో ఇక్కడకు వచ్చి అడ్డుకున్నట్టు చెప్పారు. చెట్లు నరుకుతున్న వారిని ప్రశ్నించగా.. అనకపల్లికి చెందిన గవర అప్పల నాయుడు పురమాయించడంతో నరుకున్నామని చెబుతున్నారని, దీనిపై అప్పల నాయుడును ప్రశ్నించగా చెరువు సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, ఉపాధ్యక్షుడు బొండా శివరాం, చెట్లను తమకు విక్రయించారని చెప్పాడన్నారు.

కోర్టు తీర్పుతోనే చెట్లు విక్రయం

సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు మీడియాతో మాట్లాడుతూ, 2014లో హుద్‌హుద్ తుఫాన్ కారణంగా చెరువులో కూలిపోయిన చెట్లను నరుక్కోవడానికి ప్రభుత్వానికి రూ.2.5 లక్షలు చెల్లించినట్టు చెప్పారు. అప్పుడు కూడా తానే సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్నాననీ, కొంత మంది వ్యక్తులు తనకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారని తెలిపారు. గత ఏడాది తనకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందని దీంతో చెట్లను విక్రయించానని వివరించారు.



బాలల పరిరక్షణ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న లోవరాజు

బాల కార్మికులపై ప్రత్యేక నిఘా

▸▸ జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులపై ప్రత్యేక నిఘా పెట్టామని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు తెలిపారు. మండలంలోని లింగరాజుపాలెం గ్రామంలో శుక్రవారం 11 మంది సభ్యులతో కూడిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కమిటీల ద్వారా పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడైనా పిల్లలతో పని చేయిస్తున్నట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిటీ సభ్యులు చేయాల్సిన పనులకు సంబంధించిన విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి ఉదయకుమారి, ఉప సర్పంచ్ అల్లూరి గోపాలకృష్ణ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

జీజే కళాశాలలో బ్రిడ్జి కోర్సు తరగతులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

కోటవురట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పెషల్ బ్రిడ్జి కోర్సు తరగతులు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఏఆర్టీ సుజాత తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపై ఆర్థిక భారం: జడ్పీటీసీ

పాయకరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసి పేదలపై ప్రభుత్వ ఆర్థిక భారం మోపుతున్నదని జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు వాపోయారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టించి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెంచి ఆర్థిక భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, 200 యూనిట్లు దాటితే మొత్తం యూనిట్లకు బిల్లులు వేయడం దారుణమని వాపోయారు. ఇప్పటికైనా ధరలు తగ్గించడంతో పాటు ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. ఆయన వెంట వైసీపీ నాయకులు బి.గోవిందు, కె.కృష్ణ, జి.చక్రవర్తి, దండా లోవరాజు, పులగల రాంబాబు, ఎస్.అప్పారావు, టి.చంటిబాబు ఉన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆస్కారం

▸▸ హోం మంత్రి వంగలపూడి అనిత

▸▸ అధికారులతో సమీక్షా సమావేశం





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వి.అనిత హాజరైన జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు

పాయకరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోనే వనరులు ఎక్కువగా ఉన్న పాయకరావుపేట అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. వచ్చే పదేళ్లలో విశాఖ, గాజువాక తరహాలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గానికి బల్క్‌డ్రగ్ పార్కు, స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని ఆమె తెలిపారు. బల్క్‌డ్రగ్ ప్రాజెక్ట్ పూర్తయితే యువతకు భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. నియోజకవర్గంలో పోలవరం కాలువ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. 2047 విజన్‌కు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. త్వరలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. అంతకుముందు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హోం మంత్రి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్య, వైద్య, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, సంఘిక సంక్షేమ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

నక్కపల్లి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని హోం మంత్రి అనిత చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, పవర్ స్ప్రేయర్స్, దమ్ము సెట్లు, దుక్కి సెట్లు, బ్రష్ కట్టర్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల తరువాత మరలా రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం ఇస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఏవోలు ఉమాప్రసాద్, సౌజన్య, ఆదినారాయణ, సరోజినీ, ఏఈవోలు సత్యనారాయణ, సాయికుమారి, పాల్గొన్నారు.



రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి అనిత

ఫీజులు ఎందుకు దండగ.. సర్కారులో బోధన మెండుగ

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు ఇంటింట ప్రచారం

సదుపాయాలు, ఫలితాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రైవేటుకు దీటుగా బోధిస్తామని భరోసా





రాత్రి వేళలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు... సదుపాయాలపై బ్రోచర్

కోటవురట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేలాది రూపాయల ఫీజులు ఎందుకు దండగ... అన్ని సదపాయాలు, ఉత్తమ బోధనతో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయిగా మెండుగ... అంటూ ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని కొడవటిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రవేశాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా రాత్రి వేళలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, బోధనా తీరు, ఫలితాల గురించి వివరిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సర పునఃప్రారంభంలో ఈ పాఠశాలను ప్రభుత్వం మోడల్ స్కూల్ లేదా హైస్కూల్ స్థాయి పెంపు కోసం విద్యా శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అలాగే ప్రభుత్వం కూడా ఈ రెండింటిలో ఏదో ఒకటి అప్‌గ్రేడ్‌గా చేసే ఆలోచనతో ఉంది. జూన్‌లో పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులను చేర్చుకునే ప్రక్రియలో భాగంగా ఒక బ్రోచర్‌ను తయారుచేసి పంచుతున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ తిరిగి ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు కట్టాలని, అదే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో కూడి ఉత్తమ బోధన అందుతుందని పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలకు దీటుగా బోధన చేస్తామని తల్లిదండ్రులు, విద్యార్థులకు భరోసా కల్పిస్తున్నారు.

పాఠశాలలను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఉపాధ్యాయులకు అవసరంమేరకు ఫర్నిచర్ ఏర్పాటు చేయడంతో పాటు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు. అలాగే ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి పాఠ్య పుస్తకాలు, దుస్తులను విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఏ మాత్రం ఖర్చు లేకుండానే నాణ్యమైన విద్యా బోధన కోసం సర్కారు బడుల్లో చేరాలని కోరుతున్నారు.

ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కృష్ణప్రసాద్ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. అలాగే ఆంగ్ల మధ్యమాన్ని బోధిస్తున్నామన్నారు. గతంలో కంటే అన్ని సదుపాయాలు సమకూరాయని ఆయన వివరించారు.

పూలేకు ఘన నివాళులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సామాజిక విప్లవ ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ధర్మవరం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, బీసీ హాస్టల్‌లో ప్రిన్సిపాల్ లక్ష్మీ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ప్రతీ ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు వారు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో సారాతో ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు తెలిపారు. వెంకటనగరంలో ఎక్సైజ్ ఎస్‌ఐ వీఎల్.ప్రశాంతి సిబ్బందితో దాడులు చేయగా ఒక మహిళ పట్టుబడ్డారని, ఆమె నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే రాజానగరంలో ఓ మహిళను అదుపులోకి తీసుకుని నాలుగు లీటర్ల సారా స్వాధీనం తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు.

పెదపల్లి రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

▸▸ శానిటేషన్ విభాగం అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశం



అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెదపల్లి రోడ్డులో గల అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అధికారులను శుక్రవారం ఆదేశించారు. ఇటీవల ఈ అండర్ బ్రిడ్జి వద్ద చెత్తా చెదారం పేరుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదపల్లి, గొల్లల పాలెం, వెంకటాపురం, మంత్రిపాలెం వార్డులకు చెందిన ప్రజలు ఎలమంచిలికి రావాలంటే ఈ అండర్ బ్రిడ్జి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ సమస్యను తెలుసుకున్న చైర్‌పర్సన్ స్వయంగా పరిశీలించారు. అండర్ బ్రిడ్జి వద్ద చెత్తను తొలగించి, నీరు నిలిచిపోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావును ఆదేశించడంతో ఆ మేరకు ఆయన పనులను ప్రారంభించారు.

కస్తూర్బా గాంధీకి నివాళి

మునగపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పాటిపల్లి గ్రామంలోని కేజీబీవీలో శుక్రవారం కస్తూర్బా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్పందించే హృద యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం ఇక్కడ ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఏటా ఈ వేడుకలను జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ఏపీఎస్ మూర్తి, పాఠశాల మాజీ చైర్మన్ కొయిలాడ నరసింగరావు తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాదేవిపేటలో వాటర్ ట్యాంక్ పరిశీలన

మునగపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాదేవిపేటలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను త్వరలో ప్రారంభించనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ట్యాంక్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ త్వరలో ఈ ట్రాంకు గ్రామస్థులకు అందుబాటులోకి రానుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, జనసేన నాయకుడు కేవీఏ నరసింహానాయుడు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాకపోకలు ఇష్టారాజ్యం!

▸▸ పట్టణంలో వన్ వే నిబంధనలు బేఖాతరు ▸▸ పట్టించుకోని పోలీసులు ▸▸ ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బందులు



సైతారుపేట రోడ్డు జంక్షన్‌లో వన్ వే నిబంధనలు ఉన్నా పట్టించుకోని వాహనదారులు

ఎలమంచిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన వన్ వేను పలువురు వాహనదారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దిమిలి రోడ్డు జంక్షన్, సైతారు పేట రోడ్డు జంక్షన్‌ల వద్ద గతంలో ఎదురైన సమస్యల దృష్ట్యా వన్ వేను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని, అందుకు ఉన్నతాధికారులు తమవంతు సహకారం అందించాలని కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు సైతం కోరారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. పలువురు వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలను ఈ ప్రాంతాల్లో నడుపుతుండడంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. దిమిలి రోడ్డు జంక్షన్, సైతారుపేట రోడ్డు జంక్షన్‌ల వద్ద వన్ వే పక్కాగా అమలు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని సందర్భాలలో కేసులు సైతం నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ మార్పు కానరావడం లేదు. పోలీసులు సైతం ఈ సమస్యపై పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో వాహనాల రాకపోకల సంఖ్యల బాగా పెరిగింది. పరిసరాల్లో ఉన్న సెజ్‌లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు చాలా మంది ఎలమంచిలి వివిధ పనులపై వస్తుంటారు. దీంతో రద్దీగా ఉంటుంది. ఇటువంటి తరుణంలో పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, వన్ వేలలో నిబంధనలు పక్కాగా అమల జరిగేలా చూడాలని పట్టణవాసులంతా కోరుతున్నారు.

నేడు ఎలమంచిలిలో రథయాత్ర

▸▸ చిన్నరామస్వామి ఆలయం వద్ద ప్రారంభం



తులసీనగర్‌లో సిద్ధంగా ఉంచిన రథం

ఎలమంచిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తులసీ నగర్‌లో గల చిన్నరామస్వామి ఆలయం నుంచి శనివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీరామ రక్ష రథయాత్ర ప్రారంభం కానుందని మళ్ల కొండబాబు తెలిపారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఈ యాత్రలో భక్తులంతా పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



అచ్యుతాపురంలో పూలే చిత్రపటం వద్ద నివాళులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురంలో జ్యోతిరావు పూలే జయంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండల కాంప్లెక్స్‌లో గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, బొడ్డే రామ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కూండ్రపు సోమునాయుడు, నీరజ, అప్పాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి నిత్యావసరాల వితరణ

అచ్యుతాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోసయ్యపేట గ్రామంలో గల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మైనింగ్ ఇండియా కంపెనీ లిమిటెడ్ శుక్రవారం నిత్యావసర సరకులను అందజేసింది. ఆరు వందల కేజీల బియ్యం, 70 కేజీల కందిపప్పు, 43 కేజీల మంచి నూనెను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్‌టీ పట్నాయక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులకు అంతా బాసటగా నిలవాలన్నారు.



షేకిళ్లపాలెంలో తలుపులమ్మ ఆలయ ప్రారంభోత్సవం రేపు



తొలిరోజు గణపతి పూజకు హాజరైన గ్రామస్థులు

ఎలమంచిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని షేకిళ్లపాలెం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన తలుపులమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఈ నెల 13వ తేదీ ఆదివారం జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వరహాలరావు మాట్లాడుతూ ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరు కానున్నట్టు చెప్పారు.

గంగాదేవిపేటలో ఉపాధి హామీ పనులు గుర్తింపు



గ్రామంలో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గంగాదేవిపేటలో చేపట్టనున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం గుర్తించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ శివాని గ్రామంలో గల చెరువును పరిశీలించారు. ఈ చెరువు సుమారు ఎకరాన్నర ఉంటుందన్నారు. అనంతరం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, జనసేన నాయకుడు కేవీఏ నరసింహనాయుడు, కె.సూర్యనారాయణ, వి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో పైపులైన్ పునరుద్ధరణ

మునగపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వాడ్రాపల్లి గ్రామంలో దెబ్బతిన్న పైపులైన్ పునరుద్ధరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వినాయకుని గుడి వద్ద మూడు రోజుల క్రితం జేసీబీతో జరిపిన తవ్వకాల కారణంగా తాగునీటి పైపులైన్ దెబ్బతిందని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు తెలిపారు. నాటి నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు పునరుద్ధరణ పనుల ప్రారంభించినట్టు చెప్పారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, లంకెలపాలెంలలో శుక్రవారం ఆయన పర్యటించారు. అనంతరం అయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బొగ్గు లారీలు, ఫ్లైయాష్ లారీల రాకపోకలతో దుమ్ము ధూళి ఎగసిపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటి బారినుంచి కాపాడాలని దేశపాత్రునిపాలెం వాసులు కోరారు. లారీల రాకపోకల కారణంగా కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని వాపోయారు. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం లంకెలపాలెం అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, జనసేన నాయకులు దుల్ల రామునాయుడు, పిళ్లా శివకృష్ణ, బుగిడి రామగోవిందరావు, మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, సుందరపు శ్రీనివాస్, బొండా అప్పారావు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సబ్బవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో సాయిదుర్గా పీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు, సాయి పీఠం సభ్యులు స్వామివారికి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బేతిన శ్రీనివాసరావు, కర్రి బాబు, గెడ్డం సూరిబాబు, చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతర పోస్టర్లు ఆవిష్కరణ



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

లంకెలపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ, పరిసర ప్రాంత కాలనీ ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 15న అనుపోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. జిల్లాస్థాయి గుర్రపు స్వారీ ప్రదర్శన, పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాక్రమంలో సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పల్లా అప్పారావు, యలమర్తి బుజ్జి, సత్యనారాయణ, బలిరెడ్డి అప్పారావు, కిరణ్‌చంద్, పైడిరాజు, నాయుడు, శ్రీను, సంతోశ్, నాగార్జున, సునీల్, సిం హాచలం, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో



వెదుళ్లనరవ శివారు కొత్తూరులో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని సీడీపీవో లలితకుమారి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని వెదుళ్లనరవ శివారు కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం సకాలంలో అందేలా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలన్నారు. అలాగే ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో పాల్గొన్న ఏఎస్ఐ మణికుమారి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

తుమ్మపాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎన్.మణికుమారి సూచించారు. తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళల చట్టాలను విద్యార్థినులు తెలుసుకోవాలన్నారు. శక్తి టీమ్‌ల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.శంకర్రావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు చట్ట సభల్లో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి'

కొత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు చట్ట సభల్లో 52శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ సమరభేరి కార్యక్రమాన్ని అనకాపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జి కరణం తిరుపతిరావు మాట్లాడుతూ బీసీ కులాలు అన్నింటా అభివృద్ధి చెందేందుకు కులగణన జరిగి తీరాలన్నారు. బీసీ కులాల వారిపై జరుగుతున్న దాడుల నిరోధానికి రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో సుధాకర్‌కు ఆ పార్టీల నేతలు సూదికొండ మాణిక్యాలరావు, కోన లక్ష్మణ, కరణం తిరుపతిరావు తదితరులు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అయా పార్టీల నాయకులు బొట్టా నాగరాజు, కోరిబిల్లి శంకరరావు, రామచంద్రరావు, శేఖర్‌యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద ఏఎస్పీ దేవప్రసాద్ తదితరుల నివాళి



లక్ష్మీనారాయణనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో...



కశింకోట ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో...

మహోన్నతుడు జ్యోతిరావు పూలే

» జయంతి సందర్భంగా కీర్తించిన వక్తలు » వాడవాడలా విగ్రహాలు, చిత్రపటాల వద్ద అంజలి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజాన్ని స్థాపించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇక్కడి గాంధీనగరంలో గల ఎస్ఆర్ శంకరన్ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ జాహ్నవి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ జ్యోతిరావు పూలే దూరదృష్టి గల వ్యక్తి అని, ఆయన ఏ ఒక్క వర్గానికి చెందినవాడు కాదన్నారు. జనాభాలో సగభాగం గల మహిళలకు విద్య అందించాలని, వారికి జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని 1848వ సంవత్సరంలోనే మహిళల కోసం ప్రత్యేక పాఠశాలను స్థాపించిన గొప్ప వ్యక్తిగా పేర్కొన్నారు. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గొప్ప వ్యక్తిగా కీర్తించారు. మహిళలను గౌరవించాలని, కులాల మధ్య వివక్ష ఉండకూడదని, సమాజంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని ఆయన ఎంతో కృషి చేశారన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ధూళి రంగనాయకులు, బొడ్డేడ శ్రీనివాసరావు, బొట్టా చిన్నియాదవ్, బూసి రాజు, విల్లూరి హరికృష్ణ, ఆళ్ల మంగరాజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అనతరం పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.ఎనిమిది కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు. అలాగే పూలే జయంతిని అనకాపల్లి పట్టణంలోని పలుచోట్ల నిర్వహించారు. నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు దూలం బూసిరాజు, ఉపాధ్యక్షుడు బండి అప్పారావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కాండ్రేగుల సర్వేశ్వరరావు, కె.శంకర్, కె.సత్యనారాయణ, ముగడ అప్పారావు, బోని గణేష్, కొల్లి సత్యా రావు, ఎల్. అర్జునరావు, బి. పరమేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా లక్ష్మీనారాయణనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవి

తుమ్మపాల : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. గవరపాలెం గురుకుల పాఠశాలలో పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ప్రిన్సిపాల్ దేవర వెంకటేశ్వర్లు, హిందీ ఉపాధ్యాయుడు మహేంద్రనాథ్ పట్నాయక్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్ : సామాజిక సమానత్వం, విద్యా హక్కు, అణగారిన వర్గాల ఉన్నతి కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఏఎస్పీ దేవప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కుల వివక్షను అధిగమించి మహిళా విద్య ప్రాధాన్యతను సమాజానికి చాటి చెప్పిన గొప్ప సంస్కర్త పూలే అని పేర్కొన్నారు. ఏఎస్పీ ఎల్.మోహనరావు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ : జ్యోతిరావు పూలే జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో పరవాడలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సూరి అప్పారావు, గొర్లి శ్రీనివాసరావు, బి. అప్పలరాజు, కె.లక్ష్మి, కె.మాణిక్యం, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట మండలంలో...

కశింకోట : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పెదపాటి కళ్యాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. ప్రధానోపాధ్యాయిని స్వర్ణకుమారి, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిల్లల శంకరరావు, సింహా శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇక్కడి ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ, ఏవో శ్రీనివాసరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మళ్ల పరదేశినాయుడు, గంగరాజు, శ్రీనివాసరావు, రాజు, చలపతిరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఊడేరులో రైతుల ఆందోళన

» కారి చెరువులో ఫిష్ పాయింట్ ఏర్పాటుకు గట్లు వేస్తుండడంపై అభ్యంతరం

» వర్షాలు కురిస్తే పంట పొలాలు నీటమునిగే ప్రమాదం ఉందని ఆవేదన



ఊడేరులో నిరసన తెలుపుతున్న రైతులు

తుమ్మపాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం ఊడేరులో శుక్రవారం పలువురు రైతులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి పనుల్లో భాగంగా ఊడేరు పంచాయతీ పరిధిలో గల కారి చెరువులో ఫిష్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేపడుతూ గట్లు వేస్తుండడం వల్ల వర్షాలు కురిసే సమయంలో సమీప పొలాలు ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పనులు ఆపాలని నినాదాలు చేయడంతో ఉపాధి కూలీలు ఎక్కడ పనులు అక్కడ నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు దండుపాటి గంగరాజు మాట్లాడుతూ కారి చెరువు ఆయకట్టు పరిధిలో సుమారు వంద ఎకరాల పొలాలు ఉన్నాయన్నారు. చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టి గట్లు వేస్తుండడంతో ఈ పొలాలన్నీ ముంపునకు గురయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చెరువులోకి మామిడిపాలెం, అల్లిఖానుడుపాలెం, బవులువాడ, దర్జీనగర్ తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుందన్నారు. ఈ వర్షపు నీరు చెరువులోకి చేరకుండా గట్లు వేస్తే ఎగువ నీరు పొలాల్లోకి చేరి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. అనంతరం నాయకులు, అధికారులకు రైతులు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సిరసిల్లా నరసింగరావు, డి.మంగరాజు, చిన గంగరాజు, సత్యారావు, బాహుజీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

» సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్వీ నరసింగరావు కోరారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవార జరిగిన సమావేశంలో మాట్లాడారు. 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా పనులు చేస్తున్నారన్నారు. వీరంతా పోరాడి సంక్షేమ బోర్డును సాధించుకున్నారన్నారు. ఈ బోర్డులో రూ.వంద కోట్లను గత వైసీపీ ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు తరలించి బోర్డును నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి అధికారంలోకి రాగానే బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తున్నారని దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అడిగర్ల రాజు, అధ్యక్షుడు కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డిపో ఎదుట కార్మికుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎండీ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలని, నాలుగేళ్లుగా నిలిచిపోయినపదోన్నతులు వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న తదితర ఇరవై డిమాండ్లపై అంతా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.సుధాకర్, ఏఎస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కాంప్లెక్స్ ఎదుట ఎంఏ రావు, కేవీఎస్ నారాయణ, ఎం.సన్యాసి, కేఏ దేముడు రిలే నిరాహార దీక్షల్లో కూర్చొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనం ఊరేగింపు



చందనం ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు

కొత్తూరు/కశింకోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ ఇస్లాంపేటలో గల మదీనా మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం చందనం ఊరేగింపును ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు హాజరై ఊరేగింపుగా కశింకోట మండలం బయ్యవరంలో ఉన్న దర్గాలో గల బాబాకు చందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు దువాద్ అలీ, ఇబ్రహీం, సలీం, ఖాజా బాషా, మౌలాలి, యువజన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కశింకోట మండలం బయ్యవ రంలో 73వ ఉరుసు చందనోత్సవం శనివారం జరగనుందని నిర్వాహకులు అబ్దుల్ హకీమ్, అయాబ్ తెలిపారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలంతా పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

మత్స్యకారులకు పక్షం రోజుల్లో ఫార్మాసిటీలో ఉపాధి కల్పించాలి



తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతకాయల ముత్యాలు, మత్స్యకార నేతలు

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి కల్పించే ప్రక్రియను 15 రోజుల్లో చేపట్టాలని, లేకపోతే ఫార్మాసిటీని ముట్టడిస్తామని మత్స్యకార నాయకుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు హెచ్చరించారు. శుక్రవారం మత్స్యకార నాయకులతో కలిసి తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మాసిటీలో వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా పైప్‌లైన్ ద్వారా నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల మత్స్యసంపదకు ముప్పువాటిల్లి, మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిన్నదన్నారు. దీనిపై 2012లో ఫార్మాసిటీ వద్ద ఆందోళన చేపట్టగా, స్పందించిన అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్.. 500 మంది మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి కల్పిస్తామని రాత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మొదటి విడతగా వంద మందికి ఉపాధి కల్పించాలని 2018లో రెవెన్యూ డివిజనల్ అధికారి, ఫార్మా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినా అమలు చేయలేదన్నారు. ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఫార్మా సిటీలో ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను కోరారు. ఆయన వెంట మైలపల్లి అప్పన్న, అర్జిల్లి రవి, చింతకాయల అమ్మోరు ఉన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సన్యాసిఅప్పారావు తదితరులు

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో రామాలయం నిర్మాణానికి శుక్రవారం మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు దంపతులు, జనసేన నాయకుడు బుగిడి రామగోవిందరావు భూమిపూజ చేశారు. స్థానిక నాయకులు బొండా శ్రీనివాసరావు, చందక వెంకట మురళీకృష్ణ, ఆర్.మన్మథరావు, కె.నూకేశ్వరరావు, చందక కృష్ణలతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో కందిపప్పు సరఫరా పునరుద్ధరించాలి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరాను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం ప్రభుత్వాన్ని కోరారు. రేషన్‌కార్డు వినియోగదారులకు మూడు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయడం లేదన్నారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160 నుంచి రూ.170 వరకు ధర పలుకుతుండడం వల్ల పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితిని గుర్తించి వెంటనే రేషన్ ద్వారా కందపప్పును అందించాలన్నారు.

క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్‌కు సత్కారం



చైర్మన్ రవినాయుడును సత్కరించిన రాజు తదితరులు

సబ్బవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిన రవినాయుడును శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, యువతను స్థానికంగా ప్రోత్సహించి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించినట్టు ఇక్కడి విలేకరులకు రాజు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దొడ్డి సూర్యప్రకాశరావు, ఉత్తర కుమార్, హరికృష్ణ ప్రసాద్ ఉన్నారు.

రామాపురంలో ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణం తొలగిస్తున్న సిబ్బంది

కొత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు పరిధిలో ఉన్న రామాపురంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ఆక్రమణలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ఇప్పటికే అక్రమంగా నిర్మించి బహుళ అంతస్తుల నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి

» ఎంపీ డాక్టర్ తనుజారాణి

చింతపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. తొలుత వివిధశాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖపై జరిగిన చర్చలో తాజంగి గ్రామ పంచాయతీలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, జల్‌జీవన్ మిషన్ పథకం సాధ్యమైనంత వేగంగా అందుబాటులోకి తేవాలని ఆమె సూచించారు. మండలంలో జేజేఎం పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల టెండర్లు రద్దు చేయాలన్నారు. చింతపల్లిలోని సాయినగర్‌లో తాగునీటి సరఫరా కావడంలేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి, జయలక్ష్మి విమర్శించారు. దీనికి ఏఈఈ గడుతూరి స్వర్ణలత మాట్లాడుతూ, సాయినగర్‌లో సమస్య పరిష్కారానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయని, తాగునీటి పథకం నిర్మాణ పనులు ప్రారంభంకానున్నాయన్నారు. పనులు ప్రారంభించని జేజేఎం 180 టెండర్ల రద్దుచేసినట్టు చెప్పారు. తాగు నీటి పథకాలు సకాలంలో పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెద్దగెడ్డ నుంచి పెద్దూరు వరకుగల రహదారి అధ్వానంగా మారడంతో ఆర్టీసీ సర్వీసు రద్దు చేశారని యర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు తెలిపారు. దీంతో 19 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. నాబార్డు నిధులతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్టు పీఆర్ ప్రాజెక్టు ఏఈఈ వెంకటేశ్ ఈ సందర్భంగా తెలిపారు. చింతపల్లిలో లో వోల్టేజీ సమస్య వెంటాడుతున్నట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. ఈసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామనిఎల్ఐ మొట్టడం గంగరాజు తెలిపారు. ఉపాధి కూలీలకు వేతనాలు రెండు నెలలుగా అందక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య తెలిపారు. ఈనెలలో నిధులు విడుదల కానున్నట్టు ఏపీవో రాజు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ సభకు హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావుని ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ పోషణ పక్వాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు గోపీనాయక్ శారద, సాగిన వెంగళరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ తనుజారాణి

ఐదు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ లోని 132 కేవీ ఎండపల్లివలస సబ్ స్టేషన్‌లో 132 కేవీ అరకు, పాడేరు ఫీడర్ సర్క్యూట్ -1, సర్క్యూట్ 2లో మరమ్మతులు నేపథ్యంలో 13వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు.ఈస్థితిలో పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, జి. మాడుగుల మండలాల్లో అన్ని గ్రామాలకు ఆది వారం విద్యుత్‌సరఫరాకు అంతరాయముంటుందన్నారు.

వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు, పెదబయలు, సంగడ, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేపట్టారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు 16 మంది ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం కోటలో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగనున్న కుస్తీ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన 16 మంది విద్యార్థులు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులను అందుకున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పీడీలు నూకరాజు, సింహాచలంల ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొన్న ఈ విద్యార్థులు 16 బంగారు, రెండు కాంస్య పథకాలను సాధించారు. శుక్రవారం కలెక్టర్ ఎదుట కుస్తీ ప్రదర్శన నిర్వహించి ఆయననుంచి ఈ పతకాలను పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయిలోనూ బంగారు పతకాలను సాధించి జిల్లాకు వన్నెతేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్.ఏజే.అభిషేక్ గౌడ, డీఆర్‌వో కె.పద్మలత, పీడీలు పాల్గొన్నారు.

150 మంది బీసీలకు రూ.4 కోట్ల రుణం

» కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 150 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల రుణాలను అందిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం లబ్ధిదారులకు రుణాల చెక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం రాయితీపై స్వయం ఉపాధికి రుణాలను అందించేందుకు 150 మందిని ఎంపిక చేశారన్నారు. వారిలో వంద మందికి రూ.2 లక్షలు, 25 మందికి రూ.3 లక్షలు చొప్పున, 25 మందికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు చొప్పున రుణాలను మంజూరు చేశారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ ఎంజే.అభివషేక్‌గౌడ, ఎల్‌డీఎం మాతునాయుడు, డీఆర్‌వో కె.పద్మలత, బీసీ కార్పొరేషన్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిర్దిష్ట విధానంలో రోడ్ల నిర్మాణం: కలెక్టర్

పాడేరు: రహదారుల నిర్మాణంలో నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్ల నిర్మాణాలపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రహదారుల నిర్మాణానికి ఏటా కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నామని, కాని ఒక విధానాన్ని అమలు చేయడం లేదన్నారు. కొన్ని చోట్ల వేసిన రోడ్లకే మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తున్నారన్నారు. ఈ నిర్మాణాలకు ఓ యాప్ తయారు చేసి అందులో ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సూచించారు. అలాగే వంద మీటర్ల రోడ్డు నిర్మించడానికి మండలానికో రేటు చెల్లిస్తుండడంపై అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. అలాగే రోడ్ల నిర్మాణాలపై చెల్లిస్తున్న జీఎస్‌టీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజు, ఆయా శాఖల డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్‌ను అందిస్తున్న కలెక్టర్, జేసీ

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే దుకాణాలు సీజ్

అనంతగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు తప్పనిసరిగా సహకరించాలని స్థానిక తహసీల్దార్ వీ మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు వద్ద దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సంబంధించిన తదితర వస్తువులు వి క్రయించినా, వేరెవరైనా కొనుగోలుచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు. ఎప్పటికప్పుడు దుకాణాలను తనిఖీ చేస్తామని, ప్లాస్టిక్ ఉపయోగిస్తే.. వ్యాపారులకు జరిమానా విధించడంతోపాటు దుకాణాలను సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు.



బొర్రాలో దుకాణాల వద్ద తనిఖీలు చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

మద్దిగరువును మండల కేంద్రంగా ప్రకటించాలి

జి.మాడుగుల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన మద్దిగరువును మండల కేంద్రంగా ప్రకటించాలని బీసీవై పార్టీ నేత కిల్లో రాజన్ డిమాండ్ చేశారు. మండలంలోని బొయితిలి పంచాయతీ పెదగరువు తదితర గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఆంధ్రా-ఒడిశాకు ఆనుకుని ఈ ప్రాంతం ఉండడంతో అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి లోనవుతుందన్నారు. విద్య, వైద్యం అందక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతాన్ని మండల కేంద్రం ఏర్పాటుచేస్తే అభివృద్ధికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు టి.వెంకటరమణ, సన్నిబాబు, కొండబాబు, ఆనంద్, వెంకన్నబాబు, చంద్రకళ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బీసీవై నేత రాజన్, తదితరులు

కె.కొడిసింగిలో సూర్యఘర్ ప్రాజెక్టు మంజూరు



స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, డిఈఈ సన్నిరాంబాబు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరపుపేటి పంచాయతీ కె. కొడిసింగిలో 15మెగావాట్ల సూర్యఘర్ ప్రాజెక్టుకు 20 ఎకరాల స్థలం కేటాయించినట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఈపీడీసీఎల్ డీఈఈ కోట్ల సన్నిరాంబాబు, ఏఈఈ వనుము ప్రభాకరరావుతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జీకేవీధి మండలానికి 15 మెగావాట్ల సూర్యఘర్ ప్రాజెక్టు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు కెకొడిసింగి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఈపీడీసీఎల్ అధికారులకు అప్పగించేందుకు సర్వే చేపట్టామన్నారు. ప్రభుత్వం అనుమతించిన వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

కూటమి పాలనలోనే గ్రామాల అభివృద్ధి

» ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర

డుంబ్రిగుడ, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి):కూటమి ప్రభుత్వం నేతృత్వంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్టు ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండలంలోని మారుమూల సాగర పంచాయతీ గద్యగుడ మీదుగా పొడ్డగుడ వరకు మంజూరైన బీటీరోడ్డు నిర్మాణానికి దొన్నుదొర, టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ. 1, 30 కోట్లతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం లోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం పాలకుల నిర్లక్ష్యం వల్ల గిరిజన గ్రామాల్లో కనీస సదుపాయాలు దూరమయ్యాయన్నారు. ముఖ్యమం త్రి చం ద్రబాబు జోలీ మోతలేని గ్రామాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు.అనంతరం కుసుమగుడ ప్రాథమిక పాఠశాలలో సందర్శించిన ఆయన చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తౌడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవాదాసు. మాజీ ఎంపీపీ దన్నేరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిం స్వామి త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొర

రిఫ్రెషింగ్ లాంజ్ ప్రారంభం

పాడేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ సమీపంలో అనకాపల్లికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్, రిఫ్రెషింగ్ లాంజ్‌లను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ జేసీ డాక్టర్ ఏజే అభిషేక్ గౌడతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ నిర్మాణాలు పూర్తి చేయడం గొప్పవిషయమన్నారు. అదే స్ఫూర్తితో నిర్వాహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. అవసరమైన వారికి ఆధార్ కార్డు ఆధారంగా నామ మాత్రంగా కొంత ఫీజు తీసుకొని లాంజ్ కేటాయించాలన్నారు. పై అంతస్థులో ఐదు గదులతో డార్మిటరీ నిర్మించినట్టయితే రంపచోడవరం, చింతూరు వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చి తిరిగి వెళ్లలేని వారికి ఉపయోగపడుతుందన్నారు. అరకులోనూ ఈ తరహా లాంజ్ సులభ్ కాంప్లెక్స్ నిర్మించదలస్తే స్థలాన్ని కేటాయిస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో పీవీటీజీ ఎంపిక చేసి తనకు దత్తత ఇస్తే ఆ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని సొసైటీ సభ్యుడు ఎస్.జగదీశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో లవరాజు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, తహసీల్దార్ వి.త్రినాధరావు నాయుడు, సొసైటీ అధ్యక్షుడు ఎస్ఎం.నాయుడు, కార్యదర్శి బి.ఈశ్వర అప్పలనాయుడు పాల్గొన్నారు.



పాడేరు ఐటీడీఏ సమీపంలో సులభ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్

సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా మార్పు చేయాలి



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

పాడేరురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సీహెచ్‌డబ్ల్యూ)లను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సీహెచ్‌డబ్ల్యూలు తమ సమస్యలపై శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ 11 మండలాల్లో 720 మంది సీహెచ్‌డబ్ల్యూలు ఉన్నారని, వీరందరినీ తక్షణమే ఆశాలుగా మార్పు చేయాలన్నారు.ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసమ్మ మాట్లాడుతూ సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించకుంటే మేలో విజయవాడలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.సుందరరావు, ఏపీ కమ్యూనిటీ హెల్త్ వ ర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, ఉపాధ్యక్షురాలు పార్వతి, సరస్వతి పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ముహూర్తపు రాట

హుకుంపేట ఏప్రిల్ 11 ఆంధ్రజ్యోతి ; మండల కేంద్రంలో మోదకొండమ్మ ఉత్సవాలు మే 4,5,6 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక శతకంపట్టు వద్ద గిరిజన మహిళలు, వర్తక సంఘం నేతలు ముహూర్తం రాట ప్రతిష్ఠించారు. ఈ అమ్మవారి ఉత్సవాల విజయవంతానికి గ్రామస్థులు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకు మంచిరోజులు వస్తాయి: ఎంపీ

చింతపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):వైసీపీ కార్యకర్తలకు మంచి రోజులువస్తాయని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆశాభావం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో గురువారం కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ పార్టీ శ్రేణులు నిరుత్సాహ పడాల్సిన అవసరంలేదన్నారు. మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. అంతవరకు ఓపికగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, వైసీపీ మండలాధ్యక్షుడు పాంగి గణబాబు, పాస్టర్ల సంఘం నాయకులు డి. ఈనాక్, వి. సోమరాజు, జ్యోతిరాజు, రాజు, వినోద్, జాన్‌పాల్ ముస్లిం సంఘ అధ్యక్షుడు మీరా, నూరు పాల్గొన్నారు.

దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మార్క్‌రాజు

సీలేరు, ఏప్రిల్ 11 , (ఆంధ్ర జ్యోతి): దండకారణ్య వియోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మార్క్‌రాజు ఎన్నికయ్యారు. దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమిరెడ్డి మాణిక్యం, సమక్షంలో ఇటీవల పాడేరులో నిర్వహించిన ఎన్నికల్లో జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీకి చెందిన మార్క్‌రాజును రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు.



మార్క్‌రాజు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పాడేరురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటకిరణ్ డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం అంబేడ్కర్ కూడలి నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటకిరణ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ గ్రామ సచివాలయ, పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.త్రినాద్, ఈష్ట ఈసీ మెంబర్ టి.రామస్వామి, జిల్లా అధ్యక్షుడు కె.సురేశ్‌కుమార్, ఉబ్బేటి కోటేశ్వరరావు, ఎం.సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా క్లస్టర్ మ్యాపింగ్



మాట్లాడుతున్న టీడీపీ డివిజన్ నేత పాండురంగ స్వామి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అధికారులు చేపట్టిన క్లస్టర్ మ్యాపింగ్ అస్తవ్యస్తంగా ఉందని టీడీపీ పాడేరు డివిజన్ నేత పి.పాండురంగ స్వామి అన్నారు. శుక్రవారం ఆ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడారు. పొంతన లేని క్లస్టర్ మ్యాపింగ్ లిస్టును అధికారులు కలెక్టర్‌కు పంపించారని, కనీసం స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోకపోవడం విచారకరమని అన్నారు. కనీసం ఎంపీటీసీ సెగ్మెంట్ ప్రకారంగానైనా క్లస్టర్ మ్యాపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, నాయకులు కె.జగత్‌రాయి, మజ్జి చిన్నిబాబు, మాజీ సర్పంచ్ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

సీలేరు, ఏప్రిల్ 11, (ఆంధ్ర జ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే 198 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లా యాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద పూలే విగ్రహానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషిని చేసిన మహనీయుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డి, ఏవో ఈవీవీ సత్యనారాయణ, కార్మిక నాయకు లు వై. దాసరాజు, సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, వైస్ సర్పంచ్ కె వల్లీప్రసాద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆర్‌ఎల్ రామకృష్ణ, టీడీపీ నేత కె. సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.



సీలేరులో జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెన్‌కో అధికారులు, ఉద్యోగులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి: డీఎస్పీ

పాడేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటారు వాహన చట్టాన్ని విధిగా పాటించాలని డీఎస్పీ సహబాద్ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలో అకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్ ధరించాలని, ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఎస్ఐ గోవిందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సహబాద్ అహ్మద్

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

చింతపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి అంతర్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఈమేరకు ఖాళీ బిందెలతో మండల పరిషత్‌సమావేశమందిరానికి వచ్చారు. మండల సమావేశం జరుగుతుండగా వెలుపల మహిళలు తాగునీటి సమస్యపై అధికారులు స్పందించాలని నినాదాలు చేశారు. దీంతో సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్ బయటకు వచ్చి మహిళలతో మాట్లాడారు. శనివారం గ్రామాన్ని సందర్శించి మంచి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. ఈ కార్యక్రమంలో పెసా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, యువత కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎదుట మహిళలు

బాల్య వివాహం నిలిపివేత

చింతపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గెంజిగెడ్డ గ్రామంలో బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ కథనం ప్రకారం.. గూడెంకొత్తవీధి మండలం గొందిపల్లికి చెందిన కొర్ర మహాలక్ష్మి 17ఏళ్ల కుమార్తె కొర్ర రామలక్ష్మికి గెంజిగెడ్డకు చెందిన కిల్లో అర్జున్ కుమారుడు చిన్నకు గురువారం రాత్రి పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈవిషయం వాసవ్య మహిళా మండలి ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు సాయంత్రం గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. దీంతో ఇరుకుటుంబాలు వివాహన్ని రద్దు చేసుకున్నాయి. ఈకార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కార్యక్రమ కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి: తహసీల్దార్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలు నియంత్రణకు కమిటీ సభ్యులు సమర్థంగా పనిచేయాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి చైల్డ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై ముందస్తు సమాచారం తెలుసుకునేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి, సీడీపీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కిశోరీ వికాసంపై అవగాహన

పాడేరురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల్లో సీడీపీవో పి.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం, విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో ఉన్న 300 మంది విద్యార్థినులు 20 సఖీ గ్రూపులుగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఎద్దు మృతి

కొయ్యూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మం డలంలో బూదరాళ్ళ పంచాయతీ అన్నవరంలో శుక్రవారం విద్యుదాఘాతం తో గ్రామానికి చెందిన తాంబేల రమేశ్‌కు చెం దిన దుక్కిటెద్దు మృతి చెందింది. మేతకు వెళ్లి ఎద్దు గ్రా మంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు విద్యుత్తు సరఫరాకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలడంతో విద్యుత్ షాక్‌తో మత్యువాతపడింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెలేకే సుమారు రూ 30 వేల విలువ చేసే దుక్కిటెద్దు మృతి చెందిందని బాధిత రైతు వాపోతున్నాడు.

నూతన ఎంపీపీకి సత్కారం

జి.మాడుగుల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎంపీపీ లోంబోరి అప్పలరాజుతో పాటు బదిలీపై వచ్చిన సెక్రటరీని బీరం పంచాయతీ సచివాలయ ఉద్యోగులు, కూటమి నేతలు శుక్రవారం సన్మానించారు. ప్రజలకు చేరువగా పరిపాలన అందించాలని ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాదుల రత్నకుమారి కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, ఉప సర్పంచ్ మాతె సన్యాసయ్య, కొర్రారి బొంజుబాబు, సింహాచలం, వెంకట్, నాగేశ్వరరావు, చిరంజీవి, పెసా కమిటీ నాయకుడు చిన్న కృష్ణచారి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కళా వేదికను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్, ప్రయోగశాల

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల, ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పాఠశాల (పూర్వపు జూనియర్ కళాశాల)లో 1980-82 ఇంటర్ మైత్రీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.3.8 లక్షలతో నిర్మించిన కళావేదికను శుక్రవారం స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానని గుర్తు చేశారు. ఈ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వంటి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. చదువుకున్న కళాశాలకు ఉపయోపడే కార్యక్రమం చేయాలని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతీ ఏటా పూర్వ విద్యార్థులంతా కలుసుకొని రోజంతా సరదాగా గడపాలన్నారు.

రూ.60 లక్షలతో రోడ్లు, కాలువల అబివృద్ధి

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 3, 4, 5 వార్డులలో రూ.60 లక్షలతో రోడ్లు, కాలువలు, కల్వర్టులు అభివృద్ధి చేస్తున్నామని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్ తెలిపారు. మూడు వార్డులలో శుక్రవారం భూమి పూజతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పైపులైన్ వేయడానికి సీసీ రోడ్లు విచ్చలవిడిగా తవ్వేశారని విమర్శించారు. రోడ్లు ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తవ్విన రోడ్లు మరమ్మతులు చేయించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రంలో నాయకులు మర్రా అప్పలరాజు, వెంకట రిషికుమార్, దాడి శ్రీను, కొల్లాన పరదేవీనాయుడు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోండి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ వివాదాలను ఇరు వర్గాల వారు అధికారుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వి.వేణుగోపాల్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెండు పార్టీల వారు పంతాలకు పోయి కోర్టులకు వెళ్లి విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. మండల స్థాయి అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం చెర్లోపాలెంలో లోకవరపు అమ్మన్నలు లోకవరపు భైరాగి మధ్య ఉన్న భూ వివాదం విన్నారు. అలాగే మన్యపురట్లలో వనిమిన చక్రరావు, వనిమిన ప్రకాశరావు మధ్య ఉన్న భూ వివాదంలో ఒక పార్టీవారు రాకపోవడంతో వాయిదా వేశారు. అలాగే సరుగుడు గ్రామంలో అక్కచెల్లెళ్ల మధ్య ఉన్న భూ వివాదం కూడా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొండబాబుకు టీడీపీ నాయకుల పరామర్శ



మాజీ ఎంపీపీని పరామర్శిస్తున్న నాయకులు

నాతవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబును టీడీపీ నాయకులు పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొండబాబును తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, నాయకులు అంకంరెడ్డి రాంబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి తదితరులు శుక్రవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

చేతుల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

కె.కోటపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నిర్మూలనకు చేతులు పరిశుభ్రత ఎంతో అసరమని ఐసీడీఎస్ పీవో మంగతాయారు అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సింగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గర్భిణులు ప్రతి రోజూ ఆహారం తీసుకునే ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పరిశుభ్రతపై ఏపీఎం శ్రీనివాస్ మహిళలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుశీల, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి సూచించారు. సెక్టార్ పరిధిలోని దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాలలో శుక్రవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ 22వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెదురుపర్తి వెంకటాచారి, పాతాళ చిరంజీవిరావు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

▸▸ హోం మంత్రి వంగలపూడి అనిత



రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని హోం మంత్రి అనిత చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, పవర్ స్ప్రేయర్స్ దమ్ము సెట్లు, దుక్కి సెట్లు, బ్రష్ కట్టర్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల తరువాత మరలా రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం ఇస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఏవోలు ఉమాప్రసాద్, సౌజన్య, ఆదినారాయణ, సరోజినీ, ఏఈవోలు సత్యనారాయణ, సాయికుమారి, పాల్గొన్నారు.

కాలంచెల్లిన శకటం.. అదే ఆధారం!

▸▸ ఐదు మండలాలకు ఒకే అగ్నిమాపక వాహనం

▸▸ ఎక్కడ ప్రమాదం జరిగినా ఇదొక్కటే దిక్కు!

▸▸ బండి వచ్చేవరకూ భయాందోళనలో జనం

▸▸ ముప్పతిప్పలు పడుతున్న అగ్నిమాపక సిబ్బంది..

▸▸ ఇదీ చోడవరం అగ్నిమాపక కేంద్రం పరిస్థితి



చోడవరం కేంద్రంలో 15 ఏళ్ల క్రితం వాహనం



గతంలో ఉన్న వాటర్ ట్యాంకు



సక్రమంగా నీరివ్వని బోరు

చోడవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐదు మండలాలకు చోడవరంలోని అగ్నిమాపక కేంద్రం ఒక్కటే ఆధారం. ఈ సువిశాల పరిధిలో ఈ కేంద్రం నుంచి సేవలందించడమంటే కత్తిమీద సామే.. దీనికి తోడు ఈ కేంద్రంలో కాలం చెల్లిన వాహనం, మరోవైపు సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లాలో నర్సీపట్నం తరువాత ప్రాధాన్యతా క్రమంలో చోడవరం అగ్నిమాపక కేంద్రమే కీలకం. కానీ, ఇక్కడ భవనం, వసతుల పరంగా పెద్దగా సమస్యలు లేవు. అయితే, అగ్నిమాపక వాహనం 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిపోయినా, ఇంకా దీనిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ అగ్నిమాపక కేంద్రం ఇటు దేవరాపల్లి, చోడవరం, కె.కోటపాడు మండలాలతో పాటు, బుచ్చెయ్యపేట, చీడికాడ మండలాల్లో సగభాగం సేవలందించాలి. గత ఏడాది ఈ కేంద్రంలో అత్యధికంగా 117 కాల్స్ అందుకుని జిల్లాలో రెండవ స్థానంలో ఉంది. దీని బట్టి పనిభారం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మేన్లతో సహా 20మంది అవసరం కాగా, ప్రస్తుతం 14మంది మాత్రమే ఈ కేంద్రంలో పనిచేస్తున్నారు. ముగ్గురు డ్రైవర్లకు గాను ఇద్దరు ఉండగా, అందులో ఒకరిని అనకాపల్లిలోని విధుల్లో వాడుకుంటున్నారు. దీనితో ఒక్క డ్రైవర్‌తో పాటు మరో హోంగార్డు డ్రైవ్ పనిచేస్తున్నారు. ఇక ఐదుగురు ఫైర్‌మేన్లు అవసరం ఉంది. ఇక ఈ కేంద్రానికి ప్రస్తుతం రెండు బోర్లు వాటికి మోటార్లు ఉన్నా, ఇవి పాతవి కావడంతో నీరు తగినంతగా అందడం లేదు. గతంలో ఈ స్టేషన్‌లో నీటిని నిల్వకు ట్యాంకు కొత్త భవన నిర్మాణంలో కూల్చివేశారు. ఈ వాటర్ స్టోరేజీ ట్యాంకు ఉంటే బోర్ల ద్వారా వెంటనే నీరందకున్నా ప్రత్యామ్నాయంగా ఈ ట్యాంకు నీరు ఉపయోగించుకునే వీలుండేది.

ఈ కేంద్రంపై భారం తగ్గేదెలా..?

ఇక ఈ కేంద్రంలోని కాలంచెల్లిన అగ్నిమాపక వాహనంస్థానంలో మంజూరైనట్టు చెబుతున్నా కొత్త వాహనం మాత్రం రాలేదు. ఈ కేంద్రంపై భారం తగ్గాలంటే కె. కోటపాడు లేదా దేవరాపల్లి మండలాల్లో అదనంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతిపాదనలు పంపినా, ఆ రెండు మండలాల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు మోక్షం లభించలేదు.

గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



సమావేశం మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కె.కోటపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలమైన శక్తిగా తయారు చేయటానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. మెయిన్ రోడ్డులోని కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ అధ్యక్షతన శుక్రవారం నియోజకవర్గస్థాయి క్రియాశీల సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ద్వారపురెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదగడానికి క్రమశిక్షణ గల నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. గ్రామ, మండల స్థాయిలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలులో బీజేపీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రతీ మారుమూల గ్రామంలో బీజేపీ జెండాలు రెపరెపలాడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి, చిట్టిబాబు, ఈశ్వరప్రసాద్, చల్లా సత్యనారాయణమూర్తి, కోటాన ఈశ్వరరావు, శరగడం సన్యాసినాయుడు, శివ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో నీటి కష్టాలకు చెక్

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో వేసవి కాలంలో నీటి ఇబ్బందులకు తెర పడనుంది. రూ.లక్ష వ్యయంతో శనివారం కొత్త బోరు వేయించారు. ఇప్పుడున్న బోరు నీరు సరిపోక ఎండాకలంలో రోగులు ఇబ్బందులు పడేవారు. బయట నుంచి బక్కెట్లతో నీరు తెచ్చుకునేవారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు రెండు రోజుల క్రితం నిర్వహించిన ఆస్పత్రి అబివృద్ధి కమిటీ సమావేశంలో అత్యవసరంగా కొత్త బోరు తవ్వించాలని ఆదేశించారు. దీంతో ఆస్పత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ సుధాశారద నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ స్తంభం పునరుద్ధరించరూ...

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం తాళ్ల చీడికాడ-రామచంద్రపురం మార్గమధ్యలో 15 రోజులు క్రితం ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధించాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యపై లైన్‌మేన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యతో రైతుల వ్యవసాయ బోర్లకు నీటి సరఫరాతో పాటు పశువులకు నీటి సమస్య తలెత్తుందని రైతులు కోలా గంగతల్లి, అప్పలరాజు, రాంబాబు తదితరులు వాపోతున్నారు ఇప్పటికైనా మండల, డివిజన్ స్థాయి విద్యుత్ అధికారులు స్పందించి నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధంచి తెగిపడిన విద్యుత్ వైర్లు సరిచేయాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

లింగంపేటలో ఉపాధి పనులు ప్రారంభం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మరిశా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామంలో 395 జాబ్ కార్డులు ఉన్నాయని, ఈ ఏడాది అన్ని జాబ్ కార్డుల ద్వారా వంద రోజుల పని దినాలు పూర్తయ్యేలా సభ్యులను సిద్ధం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ఎన్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గొలకొండ శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యురాలు గొంతిన మహాలక్ష్మి, గ్రామ ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ, నాయకులు మరిశా దేముడు, వెంకటరమణ, బాబ్జి, తాతాజీ, రత్నం, సత్యనారాయణ, వీఆర్‌పీ రమణ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు

దేవరాపల్లి/చీడికాడ/రావికమతం/బుచ్చెయ్యపేట/మాకవరపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దేవరాపల్లి మండలంలో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి.సాయిసుందరరావు, పతివాడ నాగభూషణం, మాలిబాబు, అప్పారావు, రొప్పలరాజు, పరశురాం తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చీడికాడ మండలంలోని జైతవరం సచివాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంఘ సంస్కర్త, సామాజికవేత్త పూలే ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం మండలంలోని కొత్తకోట అంబేడ్కర్ కాలనీలో బహుజన సంక్షేమ సమాజం జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ పూడి దేవా,అంబేడ్కర్ సంఘ సభ్యులు బి.బుల్లిబాబు, పూడి అప్పారావు,నెల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విద్యాభివృద్ధికి కృషి చేయడమే కాకుండా గొప్ప సంఘ సంస్కర్త పెర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బుచ్చెయ్యపేట మండలంలో కందిపూడి పాఠశాలలో పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు మూర్తి మాట్లాడుతూ పూలే నిరంతర పోరాడిన యోధుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, రమణ, ప్రశాంత్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


రాజన్నపేట క్వారీలో రెవెన్యూ అధికారుల తనిఖీలు



క్వారీలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకరరావు తదితరులు

రోలుగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేట క్వారీని శుక్రవారం తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకరరావు, సర్వేయర్ నాయుడు తనిఖీ చేశారు. రైతుల పొలాలకు నీరు అందించే చెరువును ఆక్రమించి, అనధికారికంగా రోడ్డు వేశారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు రెండు పర్యాయాలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఏ మేరకు నిబంధనలు పాటిస్తున్నారు.. ఏ అనుమతులు ఉన్నాయి.. తదితర అంశాలను పరిశీలించారు. అలాగే అనుమతించి సామర్థ్యాన్ని మించి అధిక లోడ్‌తో వాహనాలను నడుపుతూ వడ్డిప, బుచ్చెంపేట గ్రామాల్లో రోడ్డులను ధ్వంసం చేస్తున్నారన్న ఫిర్యాదులపై క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. క్వారీకి వెళ్లడానికి చెరువు మధ్యలో రోడ్డు వేశారన్న ఫిర్యాదుపై రికార్డులను పరిశీలించి, సమగ్ర సర్వే చేపడతామని తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

జనసేనలోకి వైసీపీ సర్పంచులు, నాయకులు



పార్టీ అధ్యక్షుడు పంచకర్ల సమక్షంలో జనసేన చేరిన వైసీపీ సర్పంచులు, నాయకులు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి చెందిన సర్పంచులు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. పెదమదిన సర్పంచ్ కొలిమల్ల ధనలక్ష్మి, వెంకటరమణ, చినమదిన గ్రామ సర్పంచ్ గోవిందరావు, పెదమదిన ఉపసర్పంచ్ డి.పాపారావు, కోఆపరేటివ్ మాజీ డైరెక్టర్ కొలిమల్ల మాణిక్యం, కుమ్మరి, సాలివాహన సంఘ అధ్యక్షురాలు మాకవరపు లక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షులు వియ్యపు గోవింద్, పెదమదిన పంచాయతీ వార్డు సభ్యులు అప్పారావు, జగదీశ్, రామారావు, మహేశ్, స్కూల్ కమిటీ మాజీ అధ్యక్షులు మహేష్, బుల్లిబాబుతో పాటు సుమారు వంద కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో జనసేన పార్టీకి చోడవరం కంచుకోట కావాలన్నారు. పీవీఎస్ఎన్.రాజు మాట్లాడుతూ కూటమి న్యాయకత్వంలో చోడవరం అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీఎస్.నాయుడు, ఉపాధ్యక్షుడు తుంపాల రమేశ్, సీనియర్ నాయకులు దాడి సూర్యనాగేశ్వరరావు, దాడి గోవింద, ఎం.బాబూరావు, కె.సూరిఅప్పారావు, దొండా సాయి, పొలమరశెట్టి కృష్ణ, బుదిరెడ్ల అరుణ్, కె.నాగేశ్వరరావు, శ్రీను, నరేశ్, కొండాజీ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ మండల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వాసవీమాత క్లబ్ మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. క్లబ్ అధ్యక్షుడిగా కొట్యాడ రమేశ్, కార్యదర్శిగా కొట్యాడ దేముళ్లు, ట్రెజరర్‌గా జె.కామేశ్‌తో పాటు మరో పది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే వాసవీ వనిత క్లబ్ అధ్యక్షులుగా పుట్టా రాధిక, కార్యదర్శిగా శ్రీనాధు ఉమా, ట్రెజరర్‌గా బత్తుల అరుణ మరో ఐదుగురు మహిళా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, అందరూ తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని కోరారు. కార్యక్రమంలో సభ్యులు నరశింగరావు, శ్రీనాధు శ్రీనివాసరావు, పార్వతి, రత్నవాలి, పుట్టా బలరాం పాల్గొన్నారు.

నేడు కలశ పునః ప్రతిష్ఠ

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయం శిఖరం కలశ పునఃప్రతిష్ఠకు సన్నాహాలు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరుని పూజతో అవసరమైన ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఈ ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్నవరం దేవస్థానం అధికారులు శనివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా కలశ స్థాపన నిర్వహిస్తారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ప్రధాన అర్చకులు భద్రాచలరామం కోరారు.

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

చోడవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎస్ఐ నాగకార్తీక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస గుప్తా, గౌరీశంకర్, దేవుడు ప్రారంభించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ప్రతిభ చూపించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఆర్జేసీకి ఉచిత శిక్షణ

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 94409 04240 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

ఉత్తమ సర్వేయర్‌గా మురళీకి అవార్డు

దేవరాపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మారేపల్లి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న కె.మురళీకి ఉత్తమ సర్వేయర్ అవార్డు లభించింది. జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును శంకరం జీవీఎంసీ సమావేశ మందిరంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి ఎస్.గోపాలరాజా, రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.చిరంజీవి, అనకాపల్లి డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. తహసీల్దార్ ఎం.లక్ష్మీదేవీ, మండల సర్వేయర్ గోవిందరాజు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

రోలుగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం, అర్ల గ్రామాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి నిర్మల తదితరులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులతోనే సాగు చేయాలన్నారు. అర్ల గ్రామాన్ని వంద శాతం ప్రకృతి వ్యవసాయం గ్రామంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకున్నట్టు ఏవో తెలిపారు. ఈ ఖరీఫ్ నుంచి మరింతగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, అమలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

గొలుగొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో ఈ నెల 13వ తేదీన ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన తేదీలోగా ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రావాలని సూచించారు. ఐదో తరగతి ప్రవేశ విద్యార్థులు ఈ నెల 13వ తేదీన ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఐదు గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుచ్చెయ్యపేట గ్రామంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాటాడుతూ, విద్యుత్ స్మార్ట్ మీటర్లుతో ప్రజలపై మరిన్ని భారాలు వేయడానికి ఉద్దేశించినవిగా పేర్కొన్నారు. అదానీలాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకే ప్రజలపై మరిన్ని భారాలు మోపేందుకు ఈ స్మార్ట్‌మీటర్లు వేస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి, నేడు ట్రూఅఫ్ సర్‌చార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారం వేయడంతో పాటు స్మార్ట్‌మీటర్ల పేరుతో మరో రూ.10 వేల రూపాయలు ప్రజలపై భారం మోపడానికి బిగిస్తున్నారని, కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాంబశివరావు, ఎస్‌వి.నాయుడు, శ్రీను, రాజు, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ తప్పును మీరు చేయొద్దు

- విద్యా వ్యవస్థలో సంస్కరణల దుష్ప్రభావాలను అరికట్టాలి
- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి
- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం


ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, నేతలు

కొత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో వల్ల వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయినట్టు అధికారులు చూపారని, కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, సంస్కరణల పేరుతో మళ్లీ అదే తప్పు చేయవద్దని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యా శాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, సంస్కరణల వల్ల ఏర్పడే దుష్ప్రభావాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పంచాయతీలో ఉన్న అన్ని పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగిస్తూ, 40 మంది విద్యార్థుల కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను 'మోడల్'గా మార్చాలని కోరారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఐదు తరగతులకు కనీసం ఐదురుగురు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. 75 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం, పీడీ పోస్టులను ప్రభుత్వం తీసివేయబోతున్నదని, ఇది సరైన విధానం కాదన్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల లేని ప్రాథమికోన్నత పాఠశాలలను డీగ్రేడ్ చేయకుండా యూపీ పాఠశాలలుగానే కొనసాగించాలని కోరారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందిస్తూ.. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు,నాతవరపు సతీశ్, కృష్ణకిశోర్, రవి, ఆశ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే


- కొనియాడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు
- మహాత్మ జయంతి సందర్భంగా నివాళులు


జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్, ఇతర నేతలు

అనకాపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. సంఘ సంస్కర్త, సత్యశోధక సమాజ స్థాపకుడు జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో అట్టడుగువర్గాల అభ్యున్నతికి పూలే ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దేశంలో తొలి బాలికా పాఠశాలను ప్రారంభించిన వ్యక్తి ఆ మహనీయుడేనని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.సత్యనారాయణ, జగన్, గణేశ్, నాయుడు, వెంకటరావు, భువనేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కపై ఆంజనేయస్వామి

నక్కపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి, శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చెక్కపై ఆంజనేయస్వామి రూపాన్ని అద్భుతంగా చెక్కాడు. ఇందుకు తనకు గంటన్నర సమయం పట్టినట్టు రవి చెప్పాడు. ఈ కళాఖండం చూపరులను ఆకట్టుకుంటున్నది.


సూక్ష్మకళాకారుడు రవి చెక్కపై చెక్కిన ఆంజనేయస్వామి



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు


ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం


సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు



ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళికలు

- నియోజకవర్గాల రూపురేఖలు మారాలి
- విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. కెపాసిటీ బిల్డింగ్‌పై శుక్రవారం నగరంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక అమలుకు అనుగుణంగా తాత్కాలిక వార్షిక ప్రణాళికలు తయారుచేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల రూపురేఖలు మార్చే విధంగా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ రంగాలుగా గుర్తించిన వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మే 15వ తేదీకల్లా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విజన్ ప్రణాళిక అమలు కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, నియోజకవర్గ కమిటీలకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, ఆయా జోనల్, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు కన్వీనర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఒక్కొక్క కమిటీలో ఐదుగురు సచివాలయ సిబ్బంది ఉంటారన్నారు. వర్క్‌షాపులో రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి, పలువురు డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కిలో లిక్విడ్ గంజాయితో నలుగురి అరెస్టు


లిక్విడ్ గంజాయి చూపుతున్న డీఎస్పీ

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ పోలీసులు కిలో లిక్విడ్ గంజాయి (యాషీస్ ఆయిల్)ని స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్టు చేశారని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొలుగొండ, కృష్ణాదేవిపేట ఎస్ఐలు రామారావు, తారకేశ్వరరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారని తెలిపారు. ఒక కారుని ఆపి తనిఖీ చేయగా సైడ్ డోరు లోపల పాలిథిన్ కవర్లో పొట్లం కట్టిన కిలో లిక్విడ్ గంజాయి లభ్యమైందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారన్నారు. మిగిలిన నలుగురు నిందితుల్లో చాపగుంట గురయ్య, ముర్ల చంటిబాబు, నాగడసాయి కేశవ, అక్కి దాసరి శ్రీహరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. లిక్విడ్ గంజాయిని ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసి రవాణా చేస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. మూడు సెల్ ఫోన్లు, కారుని సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థిని అదృశ్యం

నర్సీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా చదవడం లేదని తల్లి మందలించడంతో 8వ తరగతి విద్యార్థిని ఎస్సీ బాలికల హాస్టల్ నుంచి అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి)లో 8వ తరగతి చదువుతున్న వర్షిణి మంగళవారం ఉదయం 8 గంటలకు హాస్టల్ నుంచి స్కూల్‌కి వెళుతున్నానని బయలుదేరింది. మధ్యాహ్నం తరువాత హాస్టల్‌కి తిరిగి రాకపోవడంతో వార్డెన్ రాజ్యలక్ష్మి, నర్సీపట్నం అయ్యన్నకాలనీలో ఉంటున్న విద్యార్థిని తల్లికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆర్టీసీ బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలు పరిశీలించి.. మంగళవారం ఉదయం అనకాపల్లి వైపు వెళుతున్న బస్సు ఎక్కినట్టు గుర్తించారు. బాలిక కోసం గాలిస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.


ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ నిరుద్యోగ యువతకు రూ.16.23 కోట్ల విలువ గల 32 రకాల స్వయం ఉపాధి పథకాలను అమలు చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 21 నుంచి 50 సంవత్సరాల లోపు వారు అర్హులని చెప్పారు. ఆధార్‌కార్డు, పాన్ కార్డు, తెల్లరేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. రవాణా వాహనాల కోసం దరఖాస్తు చేసు కునే వారికి ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ వుండాలని ఆమె స్పష్టం చేశారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్ బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడటంతో శుక్రవారం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మిగిలిన మూడు యూనిట్‌ల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రులు


నుజ్జయిన ఆటో

దేవరాపల్లి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ వద్ద శుక్రవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవరు సహా పలువురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి ఆటోలో ప్రయాణిస్తున్న వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సమ్మెద సమీపంలో జీడి పిక్కలు సేకరణకు రైవాడ గ్రామానికి చెందిన 20 మంది ప్రతి రోజూ ఆటోలో వెళుతుంటారు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకొని ఇంటికి ఆటోలో బయలుదేరారు. తామరబ్బ వంతెన దాటిన తరువాత మలుపులో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్క బండరాయిపై బోల్తా పడింది. ప్రమాదం విషయం తెలుసుకున్న గ్రామస్థులు వారిని బయటకు తీసి దేవరాపల్లి ఆస్పత్రికి వేరే ఆటోలో తరలించారు. ఆటో డ్రైవరు కోరి అప్పలరాజు, శీర సింహాచలమ్మలకు చేతులు విరిగిపోయాయి. వంకల అప్పనర్స, మంగ, లక్ష్మి, దుక్క అప్పనరస, చిన్న, సన్నెమ్మ, తదితరులు గాయపడ్డారు. వీరంతా దేవరాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందారు.

విస్తరణం

... 5వ పేజీ తరువాయి

నిధుల కొరత కారణంగా వీఎంఆర్డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు ఇస్తామని అధికారులు అంటున్నారు. టీడీఆర్ బాండ్ల విలువ, వాటిని వినియోగించుకునే విధానం గురించి రెవెన్యూ అధికారులు కొద్ది రోజుల నుంచి గ్రామాల వారీగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే టీడీఆర్ బాండ్లు తీసుకోవడానికి నిర్వాసితులు ససేమిరా అంటున్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం తమకు నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువకు నాలుగు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు పరిహారంగా ఇవ్వాల్సి వుంటుందని వారు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ జరుగుతున్న పది గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోనున్న వారు ఇటీవల పార్టీలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడ్డారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరు చొప్పున పోరాట కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఇటీవల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన మంత్రి.. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు నిర్వహిస్తున్న సమావేశాల్లో.. నిర్వాసితులు ఈ విషయాన్ని ప్రస్తావించి, ప్రజాభిప్రాయం మేరకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అయితే విజ్ఞాపనలను స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తాని అధికారులు చెబుతున్నారు.

గోవాడ షుగర్స్‌లో ముగిసిన క్రషింగ్

... 5వ పేజీ తరువాయి

తరబడి వేచివుండాల్సి రావడంతో చాలామంది రైతులు చెరకును బెల్లం తయారీ క్రషర్లకు అయినకాడికి అమ్ముకున్నారు. గురువారం రాత్రి క్రషింగ్ ముగించే సమయానికి లక్షా 8 వేల 758 టన్నుల చెరకు క్రషింగ్ జరగ్గా, 52 వేల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి అయింది. మిగిలిన చెరకు రసం ద్వారా మరో వెయ్యి క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద 53 వేల క్వింటాళ్లు మాత్రమే పంచదార దిగుబడి వచ్చే అవకాశం వుంది. పంచదార రికవరీ ఐదారు శాతానికి మించకపోవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం వచ్చే సీజన్‌లో చెరకు మద్దతు ధర చెల్లింపుపై పడే అవకాశం వుంది.

కొత్త రేషన్ డిపోలను డీలర్లకు అప్పగించరా?

... 5వ పేజీ తరువాయి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో డిపోలు అప్పగించడం అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి, కోడ్ ఎత్తివేసి నెల రోజులు దాటింది. అయినాసరే కొత్త వారికి రేషన్ డిపోల బాధ్యతలు అప్పగించలేదు. కాగా అచ్యుతాపురం మండలం ఎంజేపురంలో మేరుగు నూకరాజు అనే దివ్యాంగుడిని రిజర్వేషన్ విధానంలో గతంలో రేషన్ డీలర్‌గా నియమించారు ఆయన రెండేళ్ల క్రితం చనిపోయాడు. అధికారులు ఈ డిపో నిర్వహణ బాధ్యతలను తాత్కాలికంగా డ్వాక్రా సంఘానికి అప్పగించారు. కాని దీనిని ప్రస్తుతం వైసీపీ నాయకులు నడుపుతున్నారు. కాగా రేషన్ డిపోలను ఇంకా అప్పగించకపోవడంపై డీఎస్ఓ కేవీఎస్ఎన్‌మూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. జిల్లాలో కొత్తవి, పాతవి కలిపి మొత్తం 90 రేషన్ డిపోలకు డీలర్ల నియామకం కోసం గత ఏడాది డిసెంబరులో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. అయితే వివిధ అంశాలపై 30 మంది కోర్టుని ఆశ్రయించారని,వీరిలో ఆరుగురు కేసును ఉపసంహరించుకున్నారు. దీంతో 66 మందికి నియామక ఉత్తర్వులు అందజేశామని, మిగిలిన వారి విషయంలో కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని. త్వరలో రేషన్ డిపోల బాధ్యతలను అప్పగిస్తామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439